

# తోడొకరుండిన....

## – శారద పోలంరాజు



(గత సంచిక తరువాయి)

"ఏం, ఎందుకు వెళ్ళవుట. మొగుడు మొద్దులూ అక్కరలేక ఇక్కడే పడివుంటావా? సంసారం తెగతెంపులు చేసుకుంటావా ఏంటీ?"

"కొత్తగా నేను తెగతెంపులు చేసుకోవలసిన అవసరం ఏమిటి? మీ కొడుకు ఎప్పుడో చేసుకున్నాడు. అయినా ఆయనకు అక్కడే ఒక సంసారం వుండగా ఇంక నా అవసరం ఏమిట్టి? ఆయనకు ఆయన పెళ్ళానికి వండిపెట్టటానికా? పిల్లలకు సేవలు చేయటానికా?"

తల్లి కొడుకు మొహాలు చూసుకున్నారు.

కుసుమ చెప్పసాగింది. "ఇంకా వివరంగా చెప్పనవసరం లేదు. ఆ తల్లి కొడుకులు చేయవలసిన రాద్ధాంతం చేసారు. నోరునొప్పి పుట్టేదాకా అరిచారు. వాడికేం మగవాడు. ఎన్ని పెళ్ళిళ్ళైనా చేసుకుంటాడు. నీ కొడుకును కూడా అక్కడే చదివిస్తాడు అంటూ సామదాన భేధ దండోపాయాలన్ని వుపయోగించారు. నోటికొచ్చినట్టు మాట్లాడారు. నేను ఏ మాత్రం లొంగలేదు. పైగా వాళ్ళెదురుగానే అప్పటిదాకా బాగ్లో పెట్టుకొని తిరుగుతున్న టికెట్ను ముక్కలుముక్కలు చేసిపారేసాను."

***

"అంతవరకు ఎక్కడో మిణుకుమిణుకుమంటున్న ఆశ అంతరించిపోయింది. అంతటితో ఆ ఇంటికి నా సంసారానికి తిలోదకాలు వదిలేసి నా వుద్యోగం చూసుకుంటూ సందీప్ను పెంచి ఇంజనీర్ను చేసి ఇంతవాడిని చేసాను. వాడు కోరుకున్న అమ్మాయితో పెళ్ళి కూడా చేసేసాను. ఒక మంచి ఇల్లు అమర్చుకున్నాను. ఇద్దరు మనుమలతో కాలక్షేపం చేస్తూ కాలం గడిపేస్తూ వున్నాను."

"ఆ రోజులలో మీ అనసూయ అత్తయ్య కూతురు కాంతంను మోసం చేసి పెళ్ళి చేసుకుంటే మా వాళ్ళు నన్ను పెళ్ళి చేసుకొని మోసం చేసారు. అవునే పూర్ణిమా, కాంతం ఎక్కడ వున్నది ఏం చేస్తున్నది." కడుపులోవున్న బాధ అంతా స్నేహితులవద్ద వెళ్ళగక్కేటప్పటికి కొంత రిలీఫ్గా అనిపించి వేరే టాపిక్కు డైవర్ట్ చేసింది.

"దాని బొంద. అంత జరిగిన తరువాత కూడా దానికి కళ్ళు తెరుచుకోలేదు. ఇప్పుడు కదిలించినా అవే గప్పాలు బడాయిలు. ఇద్దరూ కూతుళ్ళే. వాళ్ళను కూడా తనలాగానే తయారు చేసింది. అటు చదువులు లేవు. ఇటు పెళ్ళిళ్ళు లేవు. సినిమాలూ, షోకులూ. అదే బతుకు. ఇప్పుడేమో వాళ్ళను ఏంకర్లగా చేయాలని టివి స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నది"

***

"మరి కుసుమా, అన్ని ఆటుపోటులను ఎదుర్కొని ఒంటరిగా ఇంత విజయవంతమైన తరువాత కూడా మమ్మల్ని కలవాలని అనిపించలేదా?"

"ఏమని కలవను? నేను అమెరికాలో సెటిల్ అయి హాయిగా వున్నానని మీరందరూ అనుకుంటున్న తరుణంలో నా గురించి తెలియజేసి మిమ్మల్ని కూడా బాధపెట్టాలంటే మనస్కరించలేదు. అందుకే ఒకసారి తరుణి స్కూల్ దగ్గర కనిపించినా కలిసి మాట్లాడే సాహసం చేయలేకపోయాను." తలదించుకున్నది.

"సరే కుసుమా, మీ ఆయన నీ జీవితంలో నుండి వెళ్ళిపోయాక కొడుకును పెంచావు. చదివించావు. పెళ్ళి చేసావు. మరి ఇప్పుడు అంత ఆవేదనతో ఆ కవిత రాసి మాకు చేరువ అవుదామన్నంత కష్టం మళ్ళీ ఏమొచ్చింది?" అప్పటిదాకా ఒక సస్పెన్స్ కథ వింటున్నంత వుత్కంఠతతో వింటున్న పూర్ణిమ హటాత్తుగా అడిగింది.

"ఇంతకాలం హాయిగా నా వుద్యోగం నేను చేసుకుంటూ, పిల్లవాడిని పెద్ద చేసి వాడికి కూడా పెళ్ళి అయింది అనిపించాను. చిన్నప్పటినుంచే సందీప్‌కు వాడి తండ్రి గురించి అన్ని విషయాలూ వివరించాను. అప్పుడప్పుడూ అందరు స్నేహితులలాగా తనకు కూడా తండ్రి లేడని కొంత వ్యధ చెందేవాడు. కాని వాడు కూడా పరిస్థితులతో రాజీ పడేలా తీర్చి దిద్దగలిగాను. కాని వాడి మూలకంగానే వదిలిందనుకున్న బురద మళ్ళీ అతుక్కుంది."

"అదేంటీ? సందీప్ ఏం చేసాడు?"

"ఫేస్‌బుక్."

"వ్వాఆఆఆఆఆఆట్........" వింటున్న శ్రోతలు మళ్ళీ ఒక్కసారి ఉలిక్కి పడ్డారు.

ఆ రోజు కుసుమ బాంక్ నుండి ఇంటికి వచ్చే సమయానికి రోజూ పొద్దుకూకితేకాని రాని కొడుకు కోడలు ఇంటికి వచ్చి వున్నారు.

ఎవరో నూతన వ్యక్తి కోడలి పక్కన సోఫాలో కూర్చొని వున్నాడు. దాదాపుగా ఆమెను ఆనుకొని, ఒక చేయి ఆమె భుజం చుట్టూ వేసి అరచేతితో మెడమీద భుజం మీద రాస్తూ వుండటం ఆకాస్సేపట్లోనే స్పష్టంగా కనిపించింది. ఎంత దగ్గరగా కూర్చున్నాడంటే, ఇద్దరి కాళ్ళూ రాచుకుంటూ వున్నాయి.

కోడలికి దగ్గర బంధువేమో అనుకొని తల వంచుకొని లోపలికి వెళ్ళబోయింది.

"అమ్మా! ఎవరొచ్చారో చూడు." కొడుకు మాటలతో వెనక్కి తిరిగింది.

అతను కోడలి పక్కనుండి లేచి కుసుమ దగ్గరగా వచ్చాడు. ఒక్క అడుగు వెనక్కి వేసింది.

"హాయ్ కుసుమా డార్లింగ్. వావ్. యూ లుక్ సో బ్యూటిఫుల్. అదే చార్మ్. అదే అందం." అమెరికన్ ఏక్సెంట్లో అంటూ రెండు చేతులూ ముందుకు చాచి కౌగలించుకొనే ఫోజులో ఇంకా దగ్గరకు వచ్చేటప్పటికి ఇంకా వెనుకకు జరిగింది.

"హే సందూ! మీ మమ్మీ నన్ను గుర్తుపట్టలేదు." అంటూ పెద్దగా నవ్వాడు. అప్పటికి కూడా ఆయన ఎవరో పోలిక పట్టలేకపోయింది.

"యా డాడ్ ఎప్పుడో థర్టీ ఇయర్స్ బాక్ చూసింది కదా. పోల్చుకోవటం కష్టం." అని తల్లి వైపు తిరిగి, "అమ్మా. ఆయన మా డాడీ. గుర్తుపట్టలేదా!" ఒక్కసారి తూలిపడబోయి నిలదొక్కుకొని మారుమాటలేకుండా గబగబ తనగదిలోకి వెళ్ళిపోయింది.

ఆ మాటలు వింటుంటే సంతోషం కాదు కదా, కంపరం పుడుతున్నది.

ఆ మనిషి ఆలోచనలే లేకుండా జీవితం గడిపేస్తున్న సమయంలో మళ్ళీ ఎట్లా వచ్చాడు? సందీప్‌కు ఎక్కడ పరిచయమయినాడు?

కోడలి పక్కన కూర్చున్న దృశ్యం వూహిస్తేనే అసహ్యంగా వుంది. అతనికి బుద్ధి లేకపోతే ఆ అమ్మాయి జ్ఞానం ఏమయింది? ఎవరో పరాయి వ్యక్తితో ఆ విధంగా రాసుకొని పూసుకొని కూర్చోటానికి సభ్యత అడ్డు రాలేదా?

"అమ్మా! డాడీ నీతో మాట్లాడాలంటున్నారు. వస్తావా?" కొడుక్కు సమాధానం చెప్పాలని కూడా అనిపించక మౌనంగా మంచానికి అడ్డంగా పడుకుని వుండిపోయింది.

"అత్తయ్య గారూ అంకుల్ మిమ్మల్ని పిలుస్తున్నారు." అంటూ గదిలోకి వచ్చిన కోడలితో, "నాకు బాగా తలనొప్పిగా వుంది. మీరు

మాట్లాడి పంపించేయండి. నేను బయటకు వచ్చేవరకు నన్ను ఎవరూ డిస్టర్బ్ చేయవద్దు. తలుపు దగ్గరకు వేసి వెళ్ళు." కొద్దిగా కఠినంగానే చెప్పింది.

"పూర్ గర్ల్. ఇంత కాలానికి ఎదురుగావచ్చేటప్పటికి సంతోషంతో షాక్ తిన్నట్టున్నది. షీ నీడ్స్ టైం టు రికవర్." అని మళ్ళీ పెద్దగా నవ్వటం వినిపించింది. "ఓకే డియర్స్. సీ యూ అగైన్."

ఆ రాత్రి ఇంట్లో చిన్న సైజు యుద్ధమే జరిగింది. కుసుమ కొడుకును నిలవేసింది. "మన జీవితాలను ఇంత అన్యాయం చేసిన ఆ మనిషి నీకు ఎక్కడ తగిలాడు?"

అప్పుడు సందీప్ తమ పరిచయం గురించి చెప్పిన వివరాలు వింటుంటే మతిపోయినట్టయింది కుసుమకు.

ఈ రోజుల్లో చిన్న పెద్ద అన్న వ్యత్యాసం లేకుండా మాడర్న్ గాడ్జెట్స్ వాడటం అలవాటు చేసుకుంటున్నారు. సెల్‌ఫోన్లు కంప్యూటర్లు వాడని వారు లేరు. అవి రెండు లేకపోతే అసలు ప్రపంచం ముందుకే సాగదన్నంతగా జీవితంలో భాగమయిపోయాయి.

సందీప్ వాటికి ఏ మాత్రం మినహాయింపు కాదు.

అందరిలాగే అతను కూడా ఫేస్‌బుక్ ద్వారా స్నేహితులతో కొలీగ్స్‌తో రెగ్యులర్ టచ్‌లో వుంటాడు.

తల్లి చిన్నప్పటి నుండి తండ్రి గురించి చెప్పిన విషయాలు మనసులో బాగా నాటుకు పోయాయి. కాని ఆయన ఎట్లా వుంటాడో చూద్దామన్న కుతూహలం చిన్నప్పటి నుండే వుండేది. ఆయన పేరు మురహరి అని మటుకు తెలుసు. ఇంజనీర్ అని తెలుసు.

కాని తల్లి దగ్గర ఆ ప్రస్తావన ఎప్పుడూ తెచ్చే వాడు కాదు. కనీసం ఫోటో కూడా చూడలేదు. ఎప్పుడో తల్లి చెప్పనే చెప్పింది. పెళ్ళి ఆల్బం అత్తగారి దగ్గరే వుండిపోయింది. ఆ తరువాత కూడా తామిద్దరూ కలిసి ఫోటో తీయించుకోనే లేదు. అని.

సందీప్‌కు కూడా కుసుమ లాగే చిన్నతనం నుండి కూడా పుస్తక పఠనం బాగా అలవాటు. ఒకసారి ఎలెక్స్ హేలీ రాసిన 'రూట్స్' అన్న నవల చదవటం జరిగింది. ఆ పుస్తకం చదివిన తరువాత తనకు కూడా తన మూలాలు ఏమిటి? తండ్రి ఇప్పుడు ఎక్కడ వున్నాడు? ఏం చేస్తూంటాడు? అన్న అనుమానాలు బుర్రను తొలిచివేయసాగాయి. ఆ ఫలితమే తన ఇంటిపేరు గలవాళ్ళు ఎక్కడెక్కడ వున్నారు, అన్న కుతూహలంతో ఇంటిపేరు మీద ఫేస్‌బుక్‌లో సెర్చ్ చేసేటప్పటికి కొల్లలుకొల్లలుగా పేర్లు వచ్చాయి.

అప్పుడే తండ్రి పేరు కూడా కనిపించేటప్పటికి అతనితో పరిచయం పెంచుకోవటం ఆ పైన బంధుత్వాలు బయటపడటం జరిగాయి.

తండ్రే కాదు. ఎక్కడెక్కడో వున్న తన కజిన్స్ కూడా పరిచయమయ్యారు.

ఇంక అప్పటి నుండే తల్లికి ఏ మాత్రమూ అనుమానం కలుగకుండా మురహరితో ఇ మెయిల్ ద్వారా రెగ్యులర్ టచ్‌లో వున్నాడు. మురహరి ఈ అవకాశాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. సెంటిమెంట్తో కొడుకును బాగా కొట్టాడు. భార్యా కొడుకును చూడటానికి తానెంత తహతహలాడిపోతున్నాడో ఈ దేశంలో ఒంటరితనంతో ఎంత విలవిలలాడిపోతున్నాడో అని ఏడవటం మొదలెట్టాడు.

అంతటితో ఆగక, ఆ రోజుల్లో తాను కుసుమను కూడా అమెరికాకు రమ్మంటే ఆ వాతావరణం తనకు సరిపడదని ఆమె ఇండియాలోనే వుండి పోయిందని, చేసేదేమీ లేక ఆమె పోషణార్థం నెలానెలా డబ్బు పంపిస్తున్నానని, ఒకటేమిటి, అనేకానేక కథలు చెప్పి కొడుకును పూర్తిగా తనవైపు తిప్పుకున్నాడు. అమెరికా వెళ్ళే ముందర భార్య ముందు ఎన్నెన్ని వగలుపోయి డబ్బు దోచుకున్నాడో అంతకన్నా ఎక్కువ నాటకాలు ఆడి కొడుకు మనసు దోచుకున్నాడు.

సందీప్ అతని మాటల మాయలో పూర్తిగా పడిపోయినాడు. తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడని తల్లి తనకు చెప్పినవన్నీ అబద్ధాలు అని నమ్మేసాడు. అంతటితో ఆగక తండ్రిని ఇండియాకు వచ్చేయమని ఆహ్వానించాడు. ఇన్ని సంవత్సరాలు తండ్రి దేశం కాని దేశంలో ఒంటరి

తనంతో ఎన్నో అవస్థలు పడ్డాడు. ఇంక ఈ పెద్ద వయసులోనైనా తను కొడుకుగా భాధ్యత తీసుకోవాలి అని నిశ్చయించుకున్నాడు.

అన్ని ఏర్పాట్లూ అయిపోయినాయి. మురహరి ఇండియాకు వచ్చేసాడు. ప్రస్తుతానికి హోటల్లో వుంటున్నాడు. త్వరలో భార్యా కొడుకు కోడలితో ఇంట్లో పర్మనెంట్‌గా కాపురం పెట్టే వుద్దేశంతో వున్నాడు.

ఈ వివరాలన్ని విన్న కుసుమ భద్రకాళిలా విరుచుకు పడింది.

"మన జీవితాలను ఇంత అన్యాయం చేసిన ఆ మనిషిని మళ్ళీ కలవటానికి నీకు సిగ్గెట్లా లేదురా? అతనంటే నాకు ఎంత అసహ్యమో తెలిసి కూడా అతనితో సంబంధం పెంచుకోబోతున్నావంటే............ఛీ, నా మీదనాకే అసహ్యమేస్తోంది." రాబోతున్న కన్నీటిని ఆపటానికి ప్రయత్నిస్తూ అరిచింది.

"అయినా అత్తయ్యగారూ! ఎప్పుడో ఏదో జరిగిందని బంధుత్వాలనే తెగతెంపులు చేసుకుంటామా?" చేతికి వున్న కొత్త రిస్ట్‌వాచ్ సవిరించుకుంటూ కోడలు కూడా అత్తగారికి నీతులు చెప్ప ప్రయత్నించింది. హాల్లో ఎన్నెన్నో గిఫ్ట్ పార్సెల్స్ కనిపిస్తున్నాయి.

"ఏదేమైనా అమ్మా, ఆయన నాకు తండ్రి కాకపోతాడా? మీరిద్దరూ విడాకులు కూడా తీసుకోలేదు కాబట్టి ఆయన నీ భర్త స్థానం కూడా కోల్పోలేదు."

సెంటిమెంట్‌తో కొడుకును, రకరకాల కానుకలు డబ్బుతో కోడలిని మొత్తానికి కొనేసాడు.

అంతవరకే అనుకున్నది. కాని అంతకన్నా ఇంకా షాకింగ్ న్యూస్ చెప్పాడు సందీప్.

"ఇంకా కొద్ది నెలలలో డాడీకి సిక్స్‌టీ ఇయర్స్ కంప్లీట్ అవుతాయి. ఆ సందర్భంగా మీ ఇద్దరికి శాస్త్రోక్తంగా షష్ఠిపూర్తి గ్రాండ్‌గా చేసి, మిమ్మల్నిద్దర్నీ సింగపూర్ మలేషియా పంపిద్దామనుకుంటున్నాము."

"అంటే అత్తయ్యగారికి సెకండ్ హనీమూన్ అన్నమాట. ఓ సారీ ఆ రోజుల్లో హనీమూన్లు వుండేవి కాదు కదా! అయితే ఇది మీకు చాల థ్రిల్లింగ్ ఎక్స్పీరియన్స్. ఆప్పుడు మిస్సయిన మధుర క్షణాలు ఇప్పుడు అందుకుంటారు." వుత్సాహంగా అంటున్న కోడలి మీద అరిచింది. "మానసా! ఏం మాట్లాడుతున్నావో నీకేమైనా అర్థమైతున్నదా? ఛీఛీ......తలుచుకుంటుంటేనే అసహ్యంగా వుంది."

"అమ్మా ఇందులో అసహ్యించుకోవటానికి ఏముంది? ఈ రోజుల్లో ఎంతెంతమంది ఈ వయసులో తోడు కావాలని పెళ్ళిళ్ళు చేసుకోవటం లేదు? కాలం మారిపోయిందమ్మా. దానికి అనుగుణంగా మనం కూడా మారాలి. ఇందులో తప్పేమీ లేదు. ఇంక నువ్వు మాకు అడ్డు చెప్పవద్దు. త్వరలోనే డాడీ ఇంటికి వస్తారు. మేడమీద గది ఆయన కోసం రెనవేట్ చేయిస్తాము. షష్ఠిపూర్తి నాటికి అన్ని ఏర్పాట్లూ చేయాలి."

ఆ విధంగా ఆ దుర్మార్గుడు నా జీవితంలోకి ప్రవేశించటానికి అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాడు. నా కొడుకు కోడలూ అతని మాయలో పూర్తిగా పడిపోయినారు. నా ఇంట్లో నేనే పరాయిదాన్ని అయిపోయినాను. ఈ క్షణంలో నాకు నా అన్నవాళ్ళు కావాలి అనిపించింది. ఇంతకాలం నాకు అండగా వున్నాడనుకున్న కొడుకు కూడా పరాయివాడై పోయినాడు.

ఇంక ఏం చేయాలో తోచలేదు. ఇప్పుడు వూరంతా మారిపోయింది. ఎవరు ఎక్కడున్నారో కూడా తెలియదు. అప్పుడు అనిపించింది. అనవసరంగా అభిమానాలకు పోయి మిమ్మల్నందరిని దూరం చేసుకున్నానే అని. చివరకు ఏం చేయటానికి దిక్కుతోచక, అదిగో ఆ కవితలాంటి దేదో రాసి పడేసాను. ఎక్కడో మిణుకుమిణుకుమంటూ ఆశ. మీలో ఎవరైనా చదవకపోతారా? అర్థం చేసుకొని ఆదుకోకపోతారా అని.................." అప్పటిదాకా నిబ్బరంగా మాట్లాడిన కుసుమ ఒక్కసారి భోరుమంది. లోపలినుండి పొంగిపొరలుతున్న ఆ దుఃఖప్రవాహానికి ఆనకట్టవేసి ఆపటానికి ఎవరూ ప్రయత్నించలేదు.

హిస్టెరిక్ గా అయిన కుసుమకు రేణుక మందులిచ్చి పడుకోబెట్టి నిద్రపోయేదాకా పక్కనే వుండి తలనిమురుతూ కూర్చున్నది.

"రేణూ ఏమిటి కుసుమ పరిస్థితి? ఏం చేద్దాం?" ఆరాటంగా స్నేహితురాళ్ళు అడిగిన ప్రశ్నలకు వెంటనే సమాధానం చెప్పలేకపోయింది.

"అట్లాగే వదిలేస్తే డీప్ డిప్రెషన్‌లోకి వెళ్ళే ప్రమాదం వుంది. ఈ స్థితిలో దాన్ని మళ్ళీ కొడుకు దగ్గరకు పంపటం మరీ ప్రమాదం. ముందర కొంతకాలం తనని మన దగ్గరే వుంచుకొని కౌన్సిలింగ్ చేయవలసి వుంటుంది. దీనికి మనమొక ప్లాన్ ఆఫ్ ఏక్షన్ ఏదైనా చూడాలి. అసలు దాని మొగుడి గురించి ఆరా తీయాలి. కొడుకుతో జాగ్రత్తగా డీల్ చేయాలి. కుసుమ మాటలు పట్టి చూస్తే, మొగుడ్ని టాకిల్ చేయటం కన్నా కొడుకును టాకిల్ చేయటం లో కేర్‌ఫుల్ గా వుండాలి."

"ఆ భ్రష్టుడు అసలు అమెరికాలో ఏం వెలగబెట్టాడో ముందర విచారించాలి. ఇన్నాళ్ళ తరువాత మళ్ళీ కొడుకును భార్యను చూడాలని వచ్చాడంటే దీని వెనుక ఇంకా ఏం గూఢుపుఠాణి వుందో ఆరా తీయాలి." తరుణి అభిప్రాయం చెప్పింది.

"నిజమే. అక్కడ వుండి వచ్చినవాళ్ళ గురించి తెలుసుకోవటం పెద్ద కష్టమేమీ కాదు. అందరికీ ఐ.డి. సెక్యూరిటీ నంబర్లు పకడ్బందీగా వుంటాయి."

"అవునే నిజమే. సునంద పిన్ని కొడుకు వసంత్ అక్కడే వుంటున్నాడుగా. వాడికి వివరాలు ఇచ్చి ఇన్ఫర్మేషన్ అంతా కనుక్కోమందాము."

"అట్లాగే మా బిజినెస్ పార్ట్నర్స్ కూడా మనకు హెల్ప్ చేస్తారు. అక్కడ దాదాపు అన్ని స్టేట్స్‌లోనూ మనవాళ్ళు వున్నారు. మీరన్నట్టు ముందు అటునుండి నరుక్కొద్దాము."

అందరూ సై అంటే సై అన్నారు.

వీళ్ళు మాట్లాడుకుంటుండగానే, అంతవరకు స్నేహితురాళ్ళను ఎంజాయ్ చేయమని వదిలి వెళ్ళిన మగవారు కూడా వచ్చేసారు. వారికి కూడా కుసుమ సంగతి వివరించి తాము చేయబోయే పని కూడా వివరించారు.

"జాగ్రత్త. ఈ విషయం ఆమెకు తప్ప ఇతర ఫామిలీమెంబర్స్‌కు తెలియకుండా డీల్ చేయండి. రోజులు పూర్వంలాగా లేదు. ఎవరి ప్రైవసీ వాళ్ళది. అనవసరంగా వాళ్ళ పర్సనల్ విషయాల్లో తలదూరుస్తున్నారని తెలిస్తే మొదటికే మోసం రావచ్చు," అంటూ హెచ్చరించి తమ సహాయ సహకారాలు కావాలంటే నిరభ్యంతరంగా అడగొచ్చు అని కూడా భరోసా ఇచ్చారు.

కారు దిగుతున్న నలుగురిని చూసిన సునంద గబగబ బయటకు వచ్చింది.

కొత్త మనిషిని చూసి కొద్దిగా వెనుకకు తగ్గింది. "పిన్నీ మీ ఇంటికి ఎవరో వచ్చారు చూడు. పక్కవీధిలో మీ ఇంటి ఎడ్రెస్ అడుగుతుంటే, అటే వెళ్ళుతున్నామని మాతో తీసుకొని వచ్చాము." పూర్ణిమ మాటలకు ఆ వ్యక్తిని తేరిపార చూసిన సునంద ఆశ్చర్యంతో నోరు తెరుచుకున్నది. మొహం ఆనందంతో వికసించింది. అమాంతం కావిలించుకున్నది.

"ఎవరూ మా కుసుమే! అమ్మో అమ్మో ఎన్నాళ్ళకు? అహం ఎన్నేళ్ళయిందమ్మా నిన్ను చూసి?"

"ఏం పిన్నీ కుసుమ కనిపించిన ఆనందంలో మమ్మల్నందరినీ గేటు బయటే నిలబెట్టి మాట్లాడి పంపేస్తావా ఏంటి? పదపద లోపలికి వెళ్ళి మాట్లాడుకుందాము." ఇద్దరిని తోసుకుంటూ లోపలికి దారి తీసింది తరుణి.

మాటలు వినిపించి లోపలి నుండి ఒక యువకుడు బయటకు వచ్చాడు. "ఎవరమ్మా వచ్చింది? అంత ఎక్సైటెడ్‌గా వున్నావు?"

"వచ్చింది ఎవరో నువ్వే చెప్పరా?"

కుసుమకు అంతా అయోమయంగా వుంది. ఇన్నేళ్ళ తరువాత చూసిన సునంద పిన్ని గుర్తు పట్టటమే నమ్మశక్యంగాలేదు. అటువంటిది ఈ అపరిచిత యువకుడికి తానెవరో తెలియను కూడా తెలియదు. ఏమని చెప్పుతాడు?

అతను కూడా కొద్దిగా తేరిపారచూసి, "కుసుమ అక్కయ్య కదూ!" అనేటప్పటికి విస్తుపోయింది.

"ఏంటి కుసుమా అట్లా చూస్తున్నావు? వాడు ఎవరనుకుంటున్నావు? మన హేమూ, హేమంత్. సునంద పిన్ని పెద్ద కొడుకు."

తన ఎదురుగా ఆరడుగుల పొడుగు, పొడుగుకు తగ్గ శరీరంతో కనిపిస్తున్న అతను హేమంత్ అంటే నవ్వు వచ్చింది. తన పెళ్ళిలో చివరగా ఐదారేళ్ళ పిల్లవాడిగా చూసిన హేమంత్ ఇతనేనా?

"హేమూ, నన్ను ఎప్పుడూ చూడలేదుకదా! ఎట్లా పోల్చుకున్నావు? అయినా సునంద పిన్నీ నువ్వు కూడా చూడగానే గుర్తుపట్టేసావే?" సంతోషంగా అన్నది.

"కుసుమక్కయ్యా, మా ఇంట్లో ఈ నలుగురు కలిసినప్పుడల్లా నీ గురించే మాట్లాడుకుంటూ వుంటారు. వీళ్ళకు మరేమీ పని లేనట్టు చిన్ననాటి ముచ్చట్లే. మాచిన్నతనంలో వీళ్ళు నలుగురు కలిస్తే నాకు వసంత్ కు ఒళ్ళు మండిపోయేది. అంతవరకు మమ్మల్ని ఎంతో గారాబం చేసిన వాళ్ళు నీ ముచ్చట వచ్చేటప్పటికి మమ్మల్ని పట్టించుకోను కూడా పట్టించుకోక ఒకటే కబుర్లు."

"అది సరే. నన్నెట్లా గుర్తు పట్టావు?"

"అదేమీ పెద్ద కష్టం కాదు. మా ఇంట్లో వున్న ఆల్బంలో మీ అందరివి ఎన్నెన్నోఫోటోలు వున్నాయి. అందులో కొట్టొచ్చేటట్టు నీచెవి కింద వున్న పెసరబద్దంత పుట్టుమచ్చ చాల తక్కువమందికి వుంటుంది.

అమ్మ కళ్ళల్లో ఆనందం, నీ పక్కన తతిమ్మ "పూతరే" లను, ఆ పుట్టుమచ్చను చూడగానే అర్థమయిపోయింది, ఇన్నాళ్ళూ అసంపూర్ణంగా వున్న "పూతరేకు" పూర్తయిందని."

"పిన్నీ నీకొడుకు కూడా నీలాగే భలే చమత్కారే."

పూర్ణిమ సునందకు హేమంత్‌కు కుసుమ గురించిన విషయాలన్ని వివరంగా చెప్పింది.

"హేమూ, వసంత్ అక్కడే వున్నాడుగా! ఇవిగో మురహరి వివరాలు. అమెరికాలో అతని గురించిన వివరాలన్ని సేకరించాలి మావాడికి కూడా చెప్పాను. అతను చేసిన వుద్యోగం, పెళ్ళి పిల్లలు మొదలైన పర్సనల్ విషయాలన్ని తెలుసుకోండి."

ఆ రాత్రి అందరూ సునంద చేతి వంట మళ్ళీ రుచి చూసారు.

మామూలుగా ఏమీ జరగనట్టే చిన్ననాటి కబుర్లు, ఈ మధ్య చదివిన పుస్తకాల గురించి ముచ్చటించుకున్నారు.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments